**ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం**

**విశాఖపట్నం కేంద్రం**

**జాతీయ వార్తలు**

**తేదీ: 12-12-2025** **సమయం : రాత్రి 8గం. 30ని.లు**

**ముఖ్యాంశాలు**

- **స్థిరమైన, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా భారత ప్రభుత్వం స్థానిక నాయకులు, పౌర సమాజాలతో కలిసి పనిచేస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు.**
- **ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 15వ తేదీ నుంచి జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ దేశాల్లో పర్యటించనున్నారు.**
- **జనగణన 2027 కోసం 11 వేల 718 కోట్ల రూపాయల కేటాయింపులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
- **గడచిన దశాబ్ద కాలంలో దేశంలో వ్యవసాయ ఉత్పత్తి 44 శాతం పెరిగిందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.**

= = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మణిపూర్ లోని సేనాపతి జిల్లాను ఈరోజు సందర్శించి, పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. సేనాపతి జిల్లాలోని సహాయ శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్న వారిని కలిసి వారితో సంభాషించారు. స్థానిక మల్టీపర్పస్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ఒక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అనంతరం రాష్ట్రపతి మాట్లాడుతూ, పీఎం జన్మన్ కార్యక్రమం కింద, గిరిజన సమాజాన్ని మరింత మెరుగుపరిచే అనేక కార్యక్రమాలను ప్రారంభించామని చెప్పారు. మణిపూర్ గిరిజనులకు గౌరవం, భద్రత, అభివృద్ధి అవకాశాలు కల్పించడంతో పాటు దేశ పురోగతిలో వారిని భాగస్వాములను చేయడం జాతీయ ప్రాధాన్యత అని వ్యాఖ్యానించారు. అభివృద్ధి సమ్మిళితంగాను, స్థిరంగా ఉండేలా చూసుకునేందుకు భారత ప్రభుత్వం స్థానిక నాయకులు, పౌర సమాజాలతో కలిసి పనిచేస్తుందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్…28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 15వ తేదీ నుంచి జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ దేశాల్లో పర్యటించనున్నారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ నీనా మల్హోత్రా న్యూఢిల్లీలో ఈరోజు మీడియాతో మాట్లాడుతూ, జోర్డాన్ రాజు అబ్దుల్లా II బిన్ అల్ హుస్సేన్ ఆహ్వానం మేరకు ఈ నెల 15, 16 తేదీల్లో ప్రధానమంత్రి జోర్డాన్‌లో పర్యటిస్తారని చెప్పారు. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయ్యాయని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ జోర్డాన్‌లో పర్యటించడం ఇదే తొలిసారి అని ఆమె పేర్కొన్నారు. భారత్ జోర్డాన్ దేశాలు బలమైన ఆర్థిక సంబంధాలను పంచుకుంటున్నాయని, భారతదేశం జోర్డాన్‌కు మూడవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని తెలియజేశారు. ప్రధానమంత్రి ఈ నెల 16, 17వ తేదీలలో ఇథియోపియాను.. 17, 18 తేదీల్లో ఒమన్‌ను సందర్శిస్తారని డాక్టర్ మల్హోత్రా వివరించారు.

= = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలకు ఆమోదం లభించింది. సమావేశ వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వివరించారు. 2027 జనాభా లెక్కలను రెండు దశల్లో నిర్వహిస్తామని, దీనికోసం 11 వేల 718 కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందని తెలిపారు. ఇది మొట్టమొదటి డిజిటల్ జనాభా లెక్కల సేకరణ అని, కుల గణనను జనాభా లెక్కల సేకరణ 2027లో చేర్చనున్నామని పేర్కొన్నారు. బొగ్గు అనుసంధాన విధానం, కోల్‌సెట్యులో సంస్కరణలను క్యాబినెట్ ఆమోదించిందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ..

(వాయిస్…19 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్ అనారోగ్యంతో మహారాష్ట్ర లాతూర్‌లోని నివాసంలో ఈరోజు కన్నుమూశారు. 90 సంవత్సరాల శివరాజ్ పాటిల్ లాతూర్ నుంచి 7సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ప్రజా జీవితంలో ఆయన సుదీర్ఘకాలం పాటు ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర మంత్రితో సహా అనేక హోదాల్లో సేవలందించారు. శివరాజ్ పాటిల్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా పలువురు ప్రముఖులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. శివరాజ్ పాటిల్ మరణం తనను కలచివేసిందని ప్రధానమంత్రి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. శివరాజ్ పాటిల్ అనుభవజ్ఞుడైన నాయకుడని, సమాజ సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చేవారని ప్రధానమంత్రి తన సందేశంలో వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయ అభివృద్ధితో పాటు, రైతుల ఆదాయాన్ని పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఈరోజు సభ్యులు అడిగిన అనుబంధ ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. దేశంలో పంటల ఉత్పత్తి గత పదేళ్లలో 44 శాతం పెరిగిందని, ఇది ఒక కీలకమైన మైలురాయి అని వ్యాఖ్యానించారు. నూతన విత్తన రకాల వాడకం, ఆధునిక సాంకేతికతలు, మెరుగైన వ్యవసాయ పద్ధతుల వలన ఇది సాధ్యమైందని ఆయన పేర్కొంటూ…

(వాయిస్…18 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

దేశీయంగా విమానాలను తయారు చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించనుందని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. లోక్‌సభలో ఈరోజు ఆయన మాట్లాడుతూ.. విమానయాన రంగంలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా మేడ్-ఇన్-ఇండియా విమానాల ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్.. రష్యన్ ఎయిర్‌క్రాఫ్ట్ కంపెనీ సుఖోయ్ SJ 100తో కలిసి దేశంలో విమానాలను తయారు చేయడానికి అవసరమయ్యే సాంకేతికతలను పొందే మార్గాలను అన్వేషిస్తోందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

లోక్‌సభలో వాయు కాలుష్యం అంశాలపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటు వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. సమావేశాల మొదటి రోజే ప్రభుత్వం తన వైఖరిని చాలా స్పష్టంగా చెప్పిందని, అన్ని ముఖ్యమైన విషయాలపై, ప్రతిపక్ష పార్టీల సూచనలను తీసుకోని, పరిష్కారం కనుగొనడానికి ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఈ విషయాన్ని బిజినెస్ అడ్వైజరీ కమిటీలో లేవనెత్తారని, ప్రభుత్వం దీనిని పరిశీలించి, నిబంధనల ప్రకారం చర్చ ఎలా నిర్వహించాలో నిర్ణయించవలసి ఉందని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో 9 మంది మరణించారు. మరో 22 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి 2 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల రూపాయల సహాయాన్ని ప్రకటించారు. ప్రమాదం జరిగిన

సమయంలో మొత్తం 35 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు బస్సులో ఉన్నారు. తులసిపాక గ్రామం సమీపంలోని చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో ఈ ప్రమాదం జరిగింది. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈరోజు కెన్యా పర్యావరణ మంత్రి డాక్టర్ డెబోరా మ్లోంగో బరాసాతో సమావేశమయ్యారు. ఐక్యరాజ్యసమితి పర్యావరణ అసెంబ్లీ 7వ సెషన్ లో పాల్గొనేందుకు కెన్యాలోని నైరోబికి వెళ్లిన కీర్తి వర్ధన్ సింగ్.. కెన్యా మంత్రిని కలిశారు. వాతావరణ అనుకూలత, వ్యవసాయం, మెరుగైన పర్యావరణ పాలనలో భారత్-కెన్యా సహకారాన్ని పెంపొందించే దిశగా చర్చలు జరిపామని కేంద్ర సహాయ మంత్రి ఒక సామాజిక మాధ్యమం పోస్టులో తెలిపారు. ఇరు దేశాలు పర్యావరణ అనుకూలమైన భవిష్యత్తును నిర్మించడానికి కట్టుబడి ఉన్నాయని కీర్తివర్ధన్ సింగ్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఈ నెల 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు కర్ణాటకలోను.. 13, 14 తేదీలలో కర్ణాటక, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోను చలిగాలులు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. అలాగే రేపు మధ్య మహారాష్ట్ర, విదర్భ ప్రాంతాల్లో చలిగాలులు కొనసాగవచ్చని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర లలో రానున్న రెండు మూడు రోజుల్లో దట్టమైన పొగమంచు ఏర్పడవచ్చని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశీయంగా హైడ్రోకార్బన్‌ల అన్వేషణ, ఉత్పత్తి పెంపుదల లక్ష్యంగా మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు. వ్యాపార, కార్యకలాపాల సౌలభ్యాన్ని పెంపొందించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియమాలు-2025ను సవరించడం ఒక కీలక చర్య అని సామాజిక మాధ్యమం పోస్టులో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =